ఆ వెనక పెట్టె కడ్డీలు పట్టుకొని వ్రేలాడి ఎలాగో ఎక్కగలిగాను.

రైలు ఔటరు సిగ్నల్‌దాటి వేగంగా పోతోంది. నాలో ఆతురత పెరిగిపోతోంది. పక్కస్టేషన్‌లో ఎప్పుడుబండి ఆగుతుందా ఎప్పుడు ఆపెట్టెలోకి పోదామాఅని. ఇది నా అదృష్టానికి అంత్యపరీక్ష! నా హృదయంలో గిలిగింతలు చెలరేగుతూన్నయ్! బుర్రలో వుప్పెనలా పొంగివస్తున్నాయి ఆలోచనలు.

బండి క్రిష్ణాబ్రిడ్జీమీదగా పోతోంది. కిటికీలో గుండావంగి ముందుపెట్టెవంకే చూస్తూ వున్నాను. కనకదుర్గ కొండచాటుకు సూర్యుడు పోయాడు. పచ్చని చేల్లోంచి నిండుచంద్రుడు పైకొస్తున్నాడు. కృష్ణవేణి తెల్లటి వెన్నెలతో జలకమాడుతోంది.

ముందుపెట్టెవైపు తదేకదీక్షగా చూస్తూ వున్నాను. మాపెట్టె వంతెనమధ్యకు రాగానే ముందుపెట్టెలోవున్న బుష్‌కోటువ్యక్తి సూట్‌కేసును మెల్లగా నదిలోకి విసిరివేశాడు. అది తెల్లటి వెన్నెల్లో మెరుస్తూ గుండ్రంగా తిరుగుతూ పోయి పొంగిపొరలి ప్రవహిస్తోన్న ప్రవాహంలో మునిగిపోయింది. నా అదృష్టం, నా ఆశలూ, దాంతోనే మునిగిపోయినై. కృష్ణాకెనాల్ స్టేషన్‌లో బండి ఆగీ ఆగకముందే దిగి ఆ బుష్‌కోటువ్యక్తి పచ్చటి వరిచేలకు అడ్డంపడి మెల్లగా నింపాదిగా నడుస్తో వెళ్లిపోయాడు.

కథానిక

# చెప్పలేని ఆత్మీయత

యం. వి. యస్. కృపారావు

"మందులషాపు" అని తెల్లటి అక్షరాలు తళతళా మెరుస్తున్నాయి నల్లబోర్డుమీద ఎండబాగాపడి. దగ్గరదగ్గర మధ్యాహ్నం పన్నెండవుతోంది. బజార్లో జనంకూడా బాగా తగ్గిపోయారు. తనకొట్టులో స్తంభానికి పక్కగా వేళ్ళాడకట్టబడిన ఆ చిన్నబోర్డువైపు కాసేపు, బజార్లో అప్పుడప్పుడు వచ్చేపోయే ఒకరిద్దరివైపు కాసేపుచూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు సముద్రయ్య. పొద్దున్నుంచి ఇప్పటివరకూ ఒక కానీ కూడా అమ్మకంలేదు. ఇప్పటికి తనకొట్టువయస్సు దాదాపు పాతిక సంవత్సరాలు. మొదట్లో ఆ వూరంతటికీ ఇదివొక్కటే మందులషాపు. లాభం కూడా అప్పట్లో బాగావచ్చేదే. షాపు ఎప్పుడు చూసినా చాలసందడిగా వుండేది. ఇద్దరు గుమాస్తాలు, ముగ్గురు చేతికిందమనుష్యులూ, మనులుతూండేవాళ్లు. కాని, ఇప్పుడో ఎక్కడచూసినా మందులషాపులే. తనషాపు అప్పటికీఇప్పటికీ ఆకారంలో, అందంలో ఏమాత్రం మారకపోయినా, కొత్తగా వొస్తున్న మెడికల్ షాపులన్నీ తళతళలాడే కొత్తగా ఫర్నిచర్‌తో, రిఫ్రిజరేటర్లతో, రంగురంగుల సీసాలతో, అందంగా అమర్చబడి శ్రావ్యమైన పాటల్ని వినిపించే రేడియోలతో చూట్టానికి ఎంతో ఆకర్షణీయంగావున్నయ్.

అమ్మకం ఎక్కువలేకపోవటంవల్ల మందులుకూడ ఎక్కువ తెప్పించటంలేగుతను. పైగా పనివాళ్లందర్నీ మానిపించి బాగా నమ్మకమున్న ఒకతన్ని మాత్రం అట్టేపెట్టాడు. ఆనందయ్యే తన ఈడువాడు. తను పెట్టినప్పట్నించీ కనిపెట్టుకుని వున్నాడు. చేసేపనేమీలేక బీరువాకు ఆనుకుని జోగుతూవచ్చేనిద్రను ఆపటానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు. షాపు చాలాశూన్యంగా వుంది. సముద్రయ్యకి ఏమీతోచటంలేదు. రిటైర్ పాక్టీసుమానుకున్న తనస్నేహితుడు డాక్టరుదత్తు కూడరాలేదు ఇవాళ. దత్తు రోజూ ఉదయాన వచ్చి ఏదో బాతాఖానీ వేశేవాడు. తనతోపాటే ఇంటికి వెళ్లిపోయేవాడు. అతను ఈరోజు ఎందుకు రాలేదోనని ఆలోచిస్తున్నాడు సముద్రయ్య.

ఇందాక బజార్లోకనబడుతున్న ఒకల్లిద్దరుకూడా తగ్గిపోయారు. షాపులన్నీ మూసేసినట్టున్నారు. బజారు చాలాశూన్యంగావుంది. ఇంకా పదినిముషాల్లో తనుకూడా షాపు కట్టేయాలనుకుంటున్నాడు. అయినా తన షాపు ఎప్పుడు కట్టేసినా ఒకటే. అటు ఆనందయ్యకూ తొందరలేదు ఇటు తనకు అంతకన్నా తొందర్లేదు—అసలు షాపు తెరిచివున్నా ఎవరూరాకపోవటంచేతా మనుషులు ఎక్కువగా లేకపోవటంవలనా, ఎప్పుడూ

మాసివున్న ప్లేటువుంటుంది. ఏదో అడుగులసవ్వడి వినబడటంతో, నెరిసిపోయిన తన కనుబొమలు కుంచించుకుని, మిలమిల మెరిసే గుంటలుపడ్డ తన కళ్లల్లోంచి దృష్టి కేంద్రీకరించి రోడ్డువైపు చూశాడు.

మాసిపోయి అక్కడక్కడ చిరుగులు చూపెడుతున్న బనియనూ, మోకాలివరకూ ఎగకట్టబడిన చిరుగుల పంచెతో, నెరిసిపోయిన గడ్డంతో, చిక్కి శల్యమైన శరీరం తూలుతుంటూ తన షాపులోకి రావటం చూశాడు సముద్రయ్య. ముడుతలుపడ్డ అతని ముఖంలో గుంటలుపడ్డ కళ్ళల్లో ఎంతో నిరాశా నిస్పృహా వ్యక్తమవుతున్నయ్. సిరాతో రాసివున్న నలిగిపోయిన చీటీని ఒకచేత్తో చూపిస్తూ రెండో చేతిలో తడిసిపోయి, బాగా మాసిపోయి, నలిగివున్న అయిదురూపాయలనోటును పట్టుకున్నాడు.

సముద్రయ్య ముందుకు వంగి ఆ చీటీని అందుకుని చదవటానికి ప్రయత్నిస్తున్నాడు. డాక్టర్లు ఏదైనా రాసేప్పుడు గబగబా నాలుగక్షరాలు గిలుకుతారు. అది చదవటానికి బ్రహ్మకైనా శక్యంగాదు, బాగా మందుల పేర్లకు, వాళ్ళు రాసే భాషకూ అలవాటుపడిన వాళ్ళుకూడా అతి కష్టంమీద చదవ కలుగుతారు.

“బాబూ తమ దగ్గరకూడా లేకపోతే ఇంక అది బతకదన్న మాటే. ఇప్పటికి అన్నిషాపులూ తిరిగాను. కొందరు షాపు కట్టేశాం ఇంకా రెండు గంటలైన తర్వాత రమ్మనీ, కొందరు ఈ నోటు పనికిరాదనీ పంపించేశారు. బాబూ మీరైనా దయచేయించండి బాబూ, పిల్లది అపాయంలో వుంది.” అన్నాడు ఆ ముసలతను తనగోడునంతా చెప్పుకుంటూ. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

సముద్రయ్య అతనిస్థితి చూడటంతో ఎన్నో ఆలోచనా తరంగాలు అతని హృదయంలో లేవటం మొదలు పెట్టినాయి. ప్రాధేయపడి అడుగుతున్న అతనికి సమాధాన మివ్వకండా, ఆనందయ్యని కేకవేసి ఏదో చెప్పాడు. అప్పుడే మగత నిద్రనుంచి లేచిన ఆనందయ్య ఆ మందు తేవటానికి జోగుతూ లోపలికి వెళ్ళాడు.

కొన్నిక్షణాలు నిశ్శబ్దంగా గడిచినాయి. ఆ సముద్రయ్య ఏదో పరధ్యానంలో వున్నాడు. అతనికిప్పుడు తనెక్కడున్నాడో తెలియటం లేదు. అలా తనను తాను మరిచిపోయి ఏదో ఆలోచిస్తున్నాడు. ఆ ముసలతనిరూపం, అతని విషాదపరిస్థితి తన హృదయంలో ఎన్నెన్నో భావాలు తెచ్చి పెడుతున్నాయి.

ఇంతలో ఆనందయ్య మందును తీసుకొని వచ్చాడు. ఆ మందును చూసిన ముసలివాడి కళ్ళల్లో ఆశ ద్యోతకమైంది. కాని ఇంతలోనే అతని కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగి, ఆ ముఖంలో భయం గోచరించింది సముద్రయ్యకు. ముసలివాడు సందేహిస్తున్నాడు అయిదురూపాయిల నోటు చెల్లుతుందోచెల్లదోనని, అతని బాధ సముద్రయ్యకు చప్పునతట్టింది. అంతసేపూ ముసలివాడి హృదయంలో చెలరేగుతున్న తుపానునూహించుకొంటున్నందువలన, ఆ పరధ్యానంలోనే మారు మాట్లాడకండా ఆ నలిగిపోయిన నోటును తీసుకుంటూ మిగతా చిల్లర ఇచ్చివేశాడు సముద్రయ్య. ముసలివాడు తృప్తిగాతూలుతూ వెళ్ళిపోయాడు. సముద్రయ్య అతనివైపే చూస్తూ ఆలోచనలో పడిపోయాడు. ఆనందయ్య బీరువాకు జేరగిలబడి అప్పుడే గుర్రుకొడుతున్నాడు. మళ్ళీ బజారు శూన్యంగావుంది. రాత్రికన్నా కూడ ఎక్కువ నిశ్శబ్దంగా వుంది.

“ముసిలోడా వొచ్చావా! నువ్వొచ్చేదాకా బతికుంటాననుకోలేదు మామా.” అన్నది అతినీరసమైన గొంతుతో కుక్కి నులక మంచంలో పడుకుని అమ్మి. ఆమె ముఖం వాడిపోయివున్నది. ఓనుమరి పదిరోజులనుంచీ లంకణం. జ్వరం కాలిపోతున్నది. డాక్టరు చూసి పెదిమ విరిచాడు.

“అలాంటి మాటలు మాట్లాడబోకు అమ్మీ. నువు లేకపోతే నాకు ప్రపంచమే లేదు. డాక్టరు బాబు కాళ్ళమీదపడి బతిమలాడితే, ఇప్పుడే సూది మందివ్వటానికి వొస్తానన్నాడు.” ధైర్యం చెబుతూ ఎలాగో అన్నాడు గుండెల్ని కదిలించే విచారం ముంచుకొస్తున్నా.

“అదేంటి మామా! అంత అవస్థపడి కూలిచేసి సంపాదించి కూడబెట్టిన ఆ అయిదురూపాయలూ పెట్టి మందు తెచ్చావా? నాలుగు రోజుల్నుంచి కూలికి కూడా పోవటంలేదు రేపు నీకు తిండెలా వస్తుంది? పిల్లాడికేం పెడతావు. మందెందుకు తెచ్చావు మామా.” అంటూ గోలపెట్టింది అమ్మి.

“లేదమ్మా! ఈ మందుతో నీకు నయమైతే ఆపైన దేవుడున్నాడు.”

"మామా నీది వొట్టివెర్రి. కర్మనెవరూ తప్పించలేరు. ఈ మందులతో చావు తప్పుతుందా? డబ్బున్నవాడు చచ్చిపోతూంటే మందులూ, డబ్బూ చావును ఆపగలుగుతున్నాయా? ఇంక ఏమీ ఆశపెట్టుకోకు మామా-ఎలాగో ఈనాలుగు మాటలూ నీతో చెప్పడానికే బతికున్నాను. అబ్బాయిని జాగర్తగా కాపాడు మామా. ఇందాకట్నుంచీ ఆకలేసి తింటానికి తిండిలేక యేడ్చి యేడ్చి నిద్రపోయాడు. ఈ డబ్బుతో మందు తేకపోతే అబ్బాయికి తిండి వుండేది. ఎలాగైనా అబ్బాయిని కాపాడు మామా. ఒక్కణ్ణే చివరకు దేవుడు మిగిల్చాడు. అంతే మామా. బెంగపెట్టుకోకు. అబ్బా గుండెల్లో నొప్పి యెక్కువైంది. ఇంక అట్టేసేపు బతకను. అబ్బా..." బాధతో కళ్ళు మూస్తుంది. మాట్లాడదు. వీచవలసిన పెనుతుపాను వీచింది ముసలివాడి హృదయంలో.

గగ్గోలుగా వలవలా ఏడుస్తున్నాడు-డాక్టరు కోసం ఎదురు చూస్తున్నాడు.

ఇంతలో బయట సైకిలు గంట మోగింది. దత్తు సైకిలుదిగి చమటతుడుచుకుంటూ షాపులోకి అడుగుపెట్టాడు. ఇతనిరాక సముద్రయ్య ఆలోచనలని పరధ్యానాన్ని ఏమాత్రం భంగపరచకపోగా అతను ఆవేశంతో "డాక్టరుగారూ నా అమ్మని ఎలాగైనా బ్రతికించండి బాబూ. మీ కష్టంవుంచుకోను, మీరుణం తీర్చుకుంటాను బాబూ" అంటున్నాడు.

డాక్టరు దత్తు ఆశ్చర్యపోతున్నాడు సముద్రయ్య వాలకంచూసి. అంతదగ్గరి స్నేహితుడు అండీ అని పిలవటం, పిచ్చిగా అర్థంలేని మాటలు మాట్లాడటం, రోజూ ఈవేళకి షాపు మూసివేస్తున్నా ఇవాళ షాపు ఇంకా తెరచివుంచటం, ఇవన్నీ అతని మనస్సును కలవరపరుస్తున్నయ్. దత్తు ఆనందయ్యవంక చూశాడు. ఆనందయ్య నిశ్చింతగా గుర్రుకొడుతూ నిద్రపోతున్నాడు. బల్లపై చేతులమీద వొరిగపడుకున్న సముద్రయ్య ఇంకా ఏదో ఆలోచిస్తున్నాడు.

ఒక్కనిముషం ఆగి దత్తు "సముద్రయ్యా నేను దత్తుని. ఏమిటా పిచ్చిధోరణి. నువ్వేం మాట్లాడుతున్నావో తెలుసా?" అనడిగాడు సముద్రయ్య శరీరాన్ని ఊపుతూ.

ఈ కుదుపుడు వల్ల సముద్రయ్య ఆలోచనలన్నీ ఒక్కసారిగా చెదరిపోయినై. తను ఇందాకట్నించీ చూస్తున్న ముసలివాడూ, ముసలిదీ లేరక్కడ. తన స్నేహితుడు దత్తు నిలబడి తనని ఏదో అడుగుతున్నాడు. ఒక్కసారిగా మళ్ళీ సముద్రయ్య ఈ ప్రపంచములో పడ్డాడు.

గాభరాగా దత్తుని అడిగాడు "ఏమిటి నువ్వడిగేది? ఇవాళ మామూలుగా వొచ్చేవేళకు రాలేదే?"

"అవును ఇవాళ ఒద్దనుకున్నా-ఒకపని తగిలింది. పాపం ఒక బీదవాని పెళ్ళాం చావు బ్రతుకుల్లోవుంటే మందుకి వొచ్చాడు. ప్రాక్టీసు మానుకున్నా వెళ్ళక తప్పిందికాదు. వెళ్ళాను చూస్తే ఆమె కండిషన్ చాలా విషాదంగావుంది. ఫలాని ఇంజక్షన్ కొని తీసుకొస్తే మళ్ళీవచ్చి ఇస్తానని చెప్పాను. హార్టు చాల వీక్‌గావుంది. వాడు ఇంజక్షన్ కొని యిచ్చివెళ్లాడు. వాడి వెనకనే నేను వెళ్ళేటప్పటికి ఆమె శాశ్వత నిద్రలోవుంది.

"ఆగు" వాడినే ఇందాకట్నుంచే నేను చూస్తున్నాను. ఆమె చచ్చిపోవటం కూడా చూశానునేను. అబ్బ! వాడిదుఃఖం దుర్భరం. ఇదంతా ఎప్పుడు చూశాను నేను? ఎక్కడ?"

"ఏమిటి నేనురాగానే పిచ్చిమాటలుమాట్లాడుతున్నావునువ్వు. ఏమిటో ఎవరినో బ్రతికించలేరా...ఇంకా ఏమిటో - ఏమిటదంతా?" అడిగాడు దత్తు సందేహానివృత్తికోసం.

"అన్నానా? నిజంగా అయితే నేనిందాకట్నుంచి కలగంటున్నానన్న మాట-మహాచెడ్డకల-ఇందాక నా షాపుకి నలిగిపోయిన అయిదురూపాయలనోటు పుచ్చుకొని ఒక ముసలివాడొచ్చాడు. వాడి పెళ్ళాం చాల అపాయకరమైన స్థితిలో వుందనీ, ఇంకా ఏదో వెళ్ళబోసుకున్నాడు. వాడు పడుతున్న బాధనంతా వూహిస్తూ అలాగే కూచున్నాను. మగతనిద్ర పట్టింది. నేను నీతో "బ్రతికించలేరా అంటున్న మాటలు వాడన్నవే. అబ్బ! ఎంతచెడుకల. పాపం అంతా నిజమేనన్నమాట! ఏమిటో అర్థంలేని ఈ జీవితాలు!" షాపు మూసివేయాల్సినమాట గుర్తుకొచ్చి ఆనందయ్యని నిద్రలేపి షాపుకట్టేసి ఎండమాడ్చివేస్తున్న జనంలేని ఆ శూన్యమైన బజారులోంచి · ముగ్గురూ, అటూ ఇటూ తూలుతూ నడుస్తున్నారు.